క్లుప్తంగా

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం బాపట్ల జిల్లా మార్టూరు పట్టణానికి చెందిన అద్దేటి అనిల్‌కుమార్, మాధవి దంపతులు రూ.40,500 విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని ఆయన సూచించారు.

తెలంగాణ డీసీఎంను కలిసిన ఎమ్మెల్యే



జగ్గయ్యపేట అర్బన్: తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం మధిర నియోజకవర్గంలోని వల్లభి గ్రామంలో కలిశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పోలంపల్లి ఆనకట్ట తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉండటంతో ఆప్రాంత రైతుల భూములు కోతకు గురై మునేటిలో కలిసిపోయాయి. ఆనకట్ట మరమ్మతులకు అనుమతులు మంజూరు చేయాలని భట్టి విక్రమార్కను కోరినట్లు ఎమ్మెల్యే తాతయ్య తెలిపారు. ఎమ్మెల్యే వెంట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పొన్నం బాలాజీ, నాయకులు కొఠారు సత్యనారాయణ ప్రసాద్, తోట నాగమల్లేశ్వరరావు, యార్లగడ్డ విశ్వనాథం, చిట్టూరి మల్లేశ్వరరావు ఉన్నారు.

150 మందికి వైద్యపరీక్షలు

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు ప్రారంభించగా, నందిగామకు చెందిన సంజీవని హాస్పిటల్ వైద్యురాలు బొగ్గవరపు దివ్య 150 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైద్యశిబిరం నిర్వాహకులు మంచాల మాధవరావు, రామసాని మణికంఠ, చందు సాయి, వైద్యసిబ్బంది, గ్రామనాయకులు పాల్గొన్నారు.

135 మందికి కంటి పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: భగవాన్ శ్రీసత్యసాయి 100వ జయంతిని పురస్కరించుకుని స్థానిక సత్యసాయి మందిరంలో ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మొత్తం 135 మందికి కంటిపరీక్షలు చేసి, 50 మందికి శుక్లాల ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు.కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కొండ, శంకర్ కంటి ఆస్పత్రి వైద్యసిబ్బంది, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

చిత్రపటాలకు ధాన్యాభిషేకం

నందిగామటౌన్: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ స్థానిక ఎమ్మెల్యే, తంగిరాల సౌమ్య ఆదివారం తన కార్యాలయంలో పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాలలో జమ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, అమ్మినేని జ్వాలా ప్రసాద్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు జలబిందెలు

రామచంద్రునిపేట(జగ్గయ్యపేట): శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం గ్రామస్తులు ముత్యాలమ్మకు భక్తి శ్రద్ధలతో జలబిందెల కార్యక్రమం నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో గ్రామస్తులు ప్రత్యేక నదీ జలాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.పెద్ద ఎసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నందిగామరూరల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తప్పవని సీఐ వైవిఎల్ నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ నాయుడు మాట్లాడుతూ నేరచరిత్ర ఉన్నవారు తమ ప్రవర్తన మార్చుకుని కుటుంబ సభ్యులతో సంతోషకర జీవనం సాగించాలన్నారు. రౌడీషీటర్లపై నిత్యం ప్రత్యేక నిఘా ఉంటుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చెడు నడవడికను మార్చుకున్నవారిపై రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని వివరించారు. అనంతరం వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు పాల్గొన్నారు.

హామీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

కూటమి పాలకులపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు



పేరకలపాడులో 'బాబు ష్యూరిటీ--మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న బండి మల్లికార్జునరావు, మార్త శ్రీనివాసరావు, వేల్పుల రమేష్



నవాబుపేటలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, శ్రీనివాసగౌడ్, వైకుంఠరావు తదితరులు

కంచికచర్ల: కూటమి పాలకులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టే విషయంలో చూపిస్తున్న శ్రద్ధను ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చూపించాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. మండలంలోని కీసర, పేరకలపాడు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇకనైనా చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. ఆపార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను అప్పన్నంగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తుండటం దుర్మార్గమన్నారు. నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు మంగలపూడి కోటిబాబు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ప్రజల తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం కీసర గ్రామానికి బోళ్ల ప్రసాదరావు, పేరకలపాడు గ్రామానికి పరిటాల గంగాధర్‌లను కన్వీనర్లుగా ఎన్నుకుని వారిని సత్కరించారు. ఆ పార్టీ నాయకులు వేల్పుల రమేష్, రాయల నరసింహారావు, మర్రి వరప్రసాదర్, బుడ్డి సత్యనారాయణ, కందుల అశోక్‌కుమార్, వేమవరపు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పడం చంద్రబాబుకు అలవాటే..

చందర్లపాడు(నందిగామటౌన్): ఎన్నికల సమయంలో ఇష్టారీతిన హామీలు ఇవ్వడం, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేయడం సీఎం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్ విమర్శించారు. చందర్లపాడు మండలంలోని తుర్లపాడు, మునగాలపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వివరాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. అనంతరం తుర్లపాడు గ్రామ కన్వీనర్‌గా పొల్లా వెంకటేశ్వరరావు, మునగాలపల్లి గ్రామకన్వీనర్‌గా నల్లని శ్రీనివాసరావును నియమించారు. కార్యక్రమంలో నాయకులు గుడేటి శ్రీనివాసరావు, పెరమసాని నరసింహారావు, బుగ్గినేని సురేష్, వేల్పుల వెంకటేశ్వర్లు, శ్రీను, చలమల పెద్దబ్బాయ్, గంగూరి వెంకటేశ్వరరావు, నల్లాని శ్రీను, పలువురు నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో...

నందిగామ రూరల్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్ర ప్రగతి నానాటికి క్షీణిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్ విమర్శించారు. మండలంలోని ఐతవరం, చందాపురం, కేతవీరునిపాడు గ్రామాల్లో ఆదివారం రాత్రి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంగా అన్యాయం, అక్రమం, వివక్షతో కూడిన రాజ్యాంగ ఉల్లంఘనలు తప్ప ప్రజలకు కూటమి చేసిన మేలు ఏమిటని ప్రశ్నించారు. ప్రజల్లో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరణచూసి తట్టుకోలేక అక్రమ కేసులను నమోదు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు సమ్మష్టిగా పనిచేసి కూటమి మోసాలను ఇంటింటికీ వివరించాలని కోరారు. ఐతవరం గ్రామ కన్వీనర్‌గా చుండు శేషగిరిరావు, కేతవీరునిపాడు కన్వీనర్‌గా నేలవెల్లి నరేంద్రబాబు, చందాపురం కన్వీనర్‌గా యద్దనపూడి దాసులను నియమించారు. కార్యక్రమంలో ఆపార్టీ వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గోనెల సీతారామయ్య, మాజీ ఎంపీపీ అరిగెల సుందరమ్మ, సర్పంచ్ నాయుడు ఉదయలక్ష్మి, నాయకులు మద్దుకూరి సాయిబాబు, పెసరమల్లి స్టాలిన్, గాడిపర్తి రామకృష్ణ, గొల్లపల్లి రాఘవులు, మద్దినేని లక్ష్మీనారాయణ, రాయపాటి జానకీప్రసాద్, నెలకుదిటి సత్యం, ముక్కపాటి శ్రీను, కోట చిన్నస్వామి, మందా బాబురావు, నెలకుదిటి మహేష్, వాకా నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



చందర్లపాడు మండలం మునగాలపల్లిలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



వత్సవాయి: పెద్దమోదుగపల్లిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాబును నమ్మితే మోసపోయినట్లే..

వత్సవాయి: బాబును నమ్మితే మోసపోవడం గ్యారంటీ అని వైఎస్సార్ సీపీ వత్సవాయి మండల అధ్యక్షులు గుత్తా శంకరరావు విమర్శించారు. మండలంలోని పెద్దమోదుగపల్లి, కన్నెవీడు గ్రామాల్లో ఆదివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించి కూటమి ప్రభుత్వం మోసాన్ని ఎండగట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కూటమి నాయకులకు భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు చావా దుర్గారాణి, కల్యాణం రాజేశ్వరి, ఎంపీటీసీ లావుడియా లక్ష్మి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు నరమనేని వెంకటేష్, వత్సవాయి గ్రామ పార్టీ అధ్యక్షులు ఎం.నరేష్, కల్యాణం సాగర్, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు యేశపోగు శ్రీనివాస్, కొలుసు తిరుపతిరావు, సోమరాజు, ఇస్సాక్ పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం..

జగ్గయ్యపేట: ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు విమర్శించారు. జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి, గరికపాడు గ్రామాల్లో ఆదివారం రాత్రి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోను గుర్తుచేస్తూ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ అధికారం కోసం సూపర్ సిక్స్ పేరుతో అబద్ధపు హామీలు గుప్పించిన కూటమి నాయకులు అధికారం చేపట్టాక ఆ హామీలను విస్మరించారన్నారు. పథకాలు ఇవ్వాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఆ కేసులకు భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, సర్పంచ్ లక్ష్మీత్రివేణి నాయుడు, గ్రామ కన్వీనర్ బెడదం సత్యం, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పాతకోటి ఉదయభాను, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బజారు సాయి, సుశీల, శ్యామల, నరసింహారావు, పెద్దపొంగు అశోక్, వేల్పుల జేమ్స్, ముత్యాలు, తిరుపతిరావు, పాతకోటి రాధ పాల్గొన్నారు.



నందిగామ మండలం కేతవీరునిపాడులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కూటమి పాలనంతా కక్షపూరితం : తన్నీరు

నవాబుపేట(పెనుగంచిప్రోలు): ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై నిలదీస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని నవాబుపేటలో ఆపార్టీ మండల అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసి కక్ష పూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసిన వైనాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘ రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, నియోజకవర్గ ఐటీ వింగ్ కన్వీనర్ బండి రంజిత్, సర్పంచ్ గొర్రెముచ్చు మేరీ, ఎంపీటీసీ సభ్యురాలు మాతంగి శాంతకుమారి, మండల ఎస్సీసెల్ కన్వీనర్ కీసర లోకేశ్వరరావు, గ్రామ నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు, చింతా నాగేశ్వరావు, మాతంగి జాన్, బాపట్ల బాబీ, ఉప్పు శివకృష్ణ, చింతల తిరుపతిరావు, గోనెల కృష్ణ పాల్గొన్నారు.

అమ్మవారికి శ్రావణమాసం సారె



ప్రత్యేకాలంకరణలో మరిడీ మహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారికి సారె తీసుకువస్తున్న మహిళా మండలి సభ్యులు, భక్తులు

నందిగామరూరల్:శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా లలితావిష్ణు వాసవి జ్ఞానవాహిని మహిళామండలి, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం నందిగామలోని మరిడీ మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాసం సారె సమర్పించారు. ముందుగా మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వాసవీ అమ్మవారి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో సారెను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు వెచ్చా మాధవి, వనమా పద్మావతి, దేవత పద్మావతి, పులిపాటి సంధ్యారాణి, ఆలయ కమిటీ సభ్యులు చవట నాగేశ్వరరావు, వనమా నరసింహారావు, మారం సత్యనారాయణ, కేతేపల్లి ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు శ్రావణ మాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసి పోయాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఫ్రెండ్ షిప్ డే వేడుకలలో వాసవీ క్లబ్ ప్రతినిధులు

నందిగామటౌన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొప్పు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి క్లబ్ పూర్వ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పబ్బతి కిషోర్, కేతేపల్లి సత్యంబాబు, మారం అమరయ్య, మారం రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యార్థులు, యువత స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షులుగా శ్రీరాం బదరీనారాయణ, కార్యదర్శిగా షేక్ ఖాసింసైదా, కోశాధికారిగా బండారు రవికుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఇన్‌స్టాలేషన్ అధికారిమిరియాల వెంకటేశ్వరరావు, ఉపగవర్నర్ సీహెచ్.శ్రీనివాసరెడ్డి, జీఎల్‌టీ కో చైర్మన్ గాంధీ, జీఎస్టీ కోఆర్డినేటర్ కె.మత్స్యప్రసాద్, ప్రతినిధులు కె.కరుణాకర్‌రావు, కె.అమర్నాథ్, ఎస్‌వీవీ.సత్యనారాయణ, డాక్టర్ రాజాకేశవప్రసాద్, జాన్‌పాల్, న్యాయవాది సత్యశ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ప్రవీణ్, పట్టాభిరామయ్య, వంశీకృష్ణ, పసుపులేటి ప్రసాద్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

శ్రావణ మాస పూజలు



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస మహోత్సవాలలో భాగంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలను ఆదివారం భక్తులు సందర్శించి పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక అద్దాల బజారులో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయం, నకాశిబజారులో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి, శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాలమ్మను జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను దంపతులు దర్శించుకుని బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, సంయుక్త కార్యదర్శి కొంకిమళ్ల సురేష్, కోశాధికారి అప్పన పిచ్చయ్య తదితరులు భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వెండి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో 14 సీట్లు ఖాళీ

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని బలుసుపాడు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంఈసీ గ్రూపులో 14 సీట్లు ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత ఆదివారం తెలిపారు. కళాశాలలో చేరేందుకు అర్హులైన విద్యార్థినులు సోమవారం ఉదయం 10 గంటలకు నుంచి నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఎస్సీ ప్రజాప్రతినిధులపై కార్యదర్శి చిన్నచూపు

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్న సర్పంచ్



మాట్లాడుతున్న సర్పంచ్ బందెల రాణి, తదితరులు

వీరులపాడు: ఎస్సీ సర్పంచ్, ప్రజాప్రతినిధుల విషయంలో అల్లూరు గ్రామకార్యదర్శి అవమానకరరీతిలో వ్యవహరిస్తున్నారని సర్పంచ్ బందెల రాణి ఆరోపించారు. అల్లూరు ఆదివారం పంచాయతీ వార్డుసభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో సర్పంచి రాణి మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టే కార్యక్రమాల గురించి కార్యదర్శి అజయ్ తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు.

ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, ముఖ్యంగా ఎస్సీలమనే చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నూతనంగా మంజూరైన 20 పింఛన్లను ప్రజాప్రతినిధులతో కాకుండా కార్యదర్శి తనకిష్టమైన వారితో పంపిణీ చేయించారన్నారు.అభివృద్ధి, తదితర కార్యక్రమాల సమాచారం కూడా తెలియనీయకుండా కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యదర్శి వ్యవహారశైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కోటేరు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు కుంపటి శ్రీను, వార్డు సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వద్ద మందుబాబుల ఆగడాలు



తొర్రకుంటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పగలగొట్టి ఉన్న బీరు సీసాలు



మందుబాబుల దాడిలో ధ్వంసమైన ఆస్పత్రి కిటికీ అద్దాలు

జగ్గయ్యపేట:పట్టణంలోని తొర్రకుంటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మందుబాబుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆరోగ్య కేంద్రానికి సమీపంలోనే మద్యం దుకాణం ఉండటంతో మందుబాబులు రాత్రి వేళల్లో ఆరోగ్య కేంద్రం పరిసరాల్లోనే మద్యం సేవిస్తూ సీసాలను అక్కడ పగులగొడుతుండటంతో ఆరోగ్యంకేంద్రం సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి మందుబాబులు ఆరోగ్యంకేంద్రం కిటికీలను పగులగొట్టడంతోపాటు తలుపులు తీసేందుకు యత్నించారు. ఈ విషయంపై ఆరోగ్యకేంద్రం సిబ్బంది వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు స్పందించి మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాలని ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్యశాలకు వచ్చే ప్రజలు కోరుతున్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



పెనుగంచిప్రోలు: నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకంగా మారినట్లు పెనుగంచిప్రోలు ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు కారణంగా గడిచిన మూడునెలల్లో ఏడు చోరీల్లో నిందితులను గుర్తించి, బాధితులకు న్యాయం చేసినట్లు వివరించారు. ఇటీవల పెనుగంచిప్రోలులో ఇంజం చెన్నయ్య ఇంటిలో అర కిలో వెండి, రూ.30 వేల నగదు అపహరణ ఘటనకు సంబంధించి నిందితుడిని 24గంటల్లో పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. ట్రైనీ ఎస్ఐ గిరిసాయి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: ఏడుగురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆదివారం తన నివాసంలో పంపిణీ చేశారు. మొత్తం ఏడుగురికి కలిపి రూ.2.24లక్షల విలువగల నగదు చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు కట్టా నరసింహారావు,మైనేని రాధాకృష్ణ, షేక్ సుభాని, ముత్తినేని అశోక్, సయ్యద్ అస్లాం, సోమ్లానాయక్, నాగరాజు, జ్వాలానాయక్ పాల్గొన్నారు.